క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ రమణయ్య

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌డీఓ టి.రమణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సేవలను విస్తృతం చేయాలని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని తెలిపారు. డ్రస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యదర్శులు పన్నులు, పంచాయతీల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ట్రెజరీ అధికారులు, సిబ్బంది

ఉదయగిరి: ఉదయగిరి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సానా శ్రీనివాసులు రెడ్డిని శుక్రవారం స్థానిక ఉపఖజానా కార్యాలయ అధికారులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రెజరీ అధికారిణి ఎం.మమత, సీనియర్ అకౌంటెంట్లు బి.శ్రీహరి, కిషోర్‌కుమార్ ఆయనను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసులు

ఉదయగిరి: మండలంలో ఉపాధి పనులు చేసే కూలీలు సమయపాలన పాటించాలని ఏపీఓ బి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని దుర్గంపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలు పనులకు ఉదయం 6 గంటలకే హాజరుకావాలన్నారు. క్షేత్రసహాయకులు కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలీ పొందాలని సూచించారు.

చెక్క నగిషీ కేంద్రం తనిఖీ



చెక్క నగిషీ కేంద్రంలోని యంత్రాలను పరిశీలిస్తున్న నిర్మలాదేవి

ఉదయగిరి: పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో ఉన్న చెక్క నగిషీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చెక్క నగిషీ కేంద్రంలోని వస్తువులు, యంత్రాలు, పరిసరాలను పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మహిళలకు బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మహిళలు చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు గౌసియాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మమ్మ

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్, సెకండియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్తును మలచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు

- ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- వందలాది మందికి వైద్యపరీక్షలు
- ఉచితంగా మందుల అందజేత



కలిగిరి: గుడ్లదొనలో వృద్ధురాలికి కంటి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కలిగిరి: ప్రజల ముంగిటకే వైద్యసేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ మెట్టుకూరు శిరీష, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. కలిగిరి మండలం గుడ్లదొనలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్లు, సిబ్బంది 427 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 35 మందికి మెరుగైన చికిత్స కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్వీ కళాధర్‌రావు, వైద్యాధికారిణి గీతారెడ్డి, సర్పంచ్ త్రోవగుంట చిన రాఘవయ్య, పీఏసీఎస్ చైర్మన్ దగ్గుమాటి ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులకు డాక్టర్లు, సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని డ్వామా పీడీ వెంకట్రావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్ బాబు, వైస్ ఎంపీపీ అనంగి రమణయ్య, ఊటుకూరు, రావిపాడు సర్పంచ్‌లు రొడ్డా వెంగమ్మ, కొండపల్లి లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గవ్వల మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి పి.పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్ పేర్కొన్నారు. అల్లూరు మండల పరిధిలోని గ్రద్దగుంట పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు డాక్టర్లు, సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, సర్పంచ్ దాసరి మల్లికార్జున, నాయకులు దాసరి శ్రీహరి, మేడా శ్రీనివాసులురెడ్డి, చెంతాటి కరుణాకర్, భక్తవత్సల రెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలో..

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రభుత్వ ఆదేశాలతో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కొనసాగుతోంది. ఆశా వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది బృందాలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. త్వరలో నిర్వహించే వైద్యశిబిరాల్లో సంపూర్ణంగా పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలని సూచిస్తున్నారు. సీహెచ్‌సీ డాక్టర్ అస్మా సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

చేజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక వరమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం చేజర్ల మండలంలోని వావిలేరు సచివాలయం పరిధిలో ఉన్న వావిలేరు ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి విచ్చేసిన రోగులు డాక్టర్లతో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 389 మంది ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్నారని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, జేసీఎస్ కన్వీనర్ పి.గంగాధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బి.వీరరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.సుధాకర్‌రెడ్డి, పరిశీలకులు పూర్ణచంద్ర, కె.వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు జి.రాంబాబు, ఎం.పెంచలయ్య, నాయకులు వెంకటరత్నంచౌదరి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, వైద్యులు పాల్గొన్నారు.

అనంతసాగరం మండలంలో..

దేవరాయపల్లి బిట్-1(పాతదేవరాయపల్లి) సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది వైద్యశిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కూడా పరీక్షలు చేయించుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వైఎస్సార్ పోషణ ఆహార పదార్థాలను అందరికీ అందజేశారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్లు 451 మందికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంపీడీఓ మధుసూదనరావు, సర్పంచ్ షేక్ రమీజాబేగం, పరిశీలకుడు ఒ.బాలకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ కృష్ణారెడ్డి, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కావలి పట్టణంలోని వెంగళరావునగర్ శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వృద్ధులకు కంటి అద్దాలు అందజేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూరు: పదో వార్డు పరిధిలో..



అల్లూరు: గ్రద్దగుంటలో..



చేజర్ల: వావిలేరులో..



చేజర్ల: అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్-1లో..



కలిగిరి: గుడ్లదొనలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శిరీష, మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి



ఉదయగిరి: ఊటుకూరులో మహిళకు మెడికల్ కిట్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ రమణయ్య

సీఆర్‌పీకి సన్మానం



మురళీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో సీఆర్‌పీగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎంఈఓ కార్యాలయానికి బదిలీ అయిన మురళీని మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నజీర్‌బాషా, కరటంపాడు, ఆరవీడు, జంగాలపల్లి, సాతానుపల్లి, వెన్నవాడ, గండ్లవీడు, బొటికర్లపాడు, ఎంఈఓ-2 చలపతి, యర్రబల్లి, పడకండ్ల పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మాల కొండలరావు, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



చేజర్ల: చేజర్ల మండల తహసీల్దార్‌గా పి.కృష్ణ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపిశెట్టి నర్సింహులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి

- డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్



రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్

ఉదయగిరి: జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యులు, సిబ్బందిపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారికి ఆప్యాయంగా సేవలందించాలని సూచించారు. వైద్యశాలలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందరు డాక్టర్లు విధిగా రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సాయంత్రం 4 నుంచి మరుసటిరోజు ఉదయం 9 గంటల వరకు డ్యూటీ డాక్టర్ వైద్యశాలలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బందిపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో వైద్యశాలల స్థాయి పెరగడంతోపాటు వైద్యులు, సిబ్బందికి గౌరవం పెరిగిందన్నారు. అలాగే సిబ్బంది, మందులు, పరికరాల కొరత లేదన్నారు. స్థానిక వైద్యశాలలో చిన్నపిల్లల డాక్టరును త్వరలో నియమిస్తారని తెలిపారు. వైద్యశాలలో అందుతున్న సేవలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఆయన ఆస్పత్రిలోని వివిధ విభాగాలను, రికార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి సిబ్బంది పనితీరు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు ఠాగూర్, అనిషా, శివరామ్, సిఫ్రారాహీ, అనుష్క తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



మెడికల్ కిట్ అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరురూరల్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కరటంపాడులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని సర్వే చేసి అదే గ్రామ సచివాలయంలో నిపుణులైన డాక్టర్లతో వైద్యశిబిరాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సైతం వైద్యసేవలను అందిస్తుందన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్నలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వైద్యాధికారి డాక్టర్ దేవానంద్, తదితరులు మాట్లాడారు. వైద్యపరీక్షలు చేయించుకున్న రోగులకు మందులతో కూడిన మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేవతి, సూరం ప్రసాద్‌రెడ్డి, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ దనాల రమేష్‌నాయుడు, రఫీ, వైద్యాధికారి డాక్టర్ అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, పరిశీలకుడు కామాక్షయ్య, రామ్మోహన్, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష

ఆత్మకూరు: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే పరమావధిగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోందని, కలెక్టర్ సూచనల మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 3 రోజులపాటు జగనన్న సురక్ష ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ షేక్ అస్మా తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తవుతున్న క్రమంలో ఈ నెల 12వ తేదీ తొలి వైద్యశిబిరం మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 16, 18 తేదీల్లో అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, వెంకట కృష్ణ, ఆశా కార్యకర్తలు ఇ.లక్ష్మి, పి.లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ ధనలక్ష్మి తదితరులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కంభం విజయారెడ్డి, మాగుంటి సుబ్బయ్యతోపాటు బదిలీలు, ప్రమోషన్లు పొందిన సూర్యప్రకాష్, భాగ్యమ్మలను శుక్రవారం కదిరినాయుడుపల్లి పాఠశాలలో ఎంఈఓ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సన్మాన గ్రహీతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, ఎంఆర్‌జీ రాజేంద్రకుమార్, కాంప్లెక్స్ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, సీఎంఆర్‌పీ కస్తూరయ్య, సీఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

ఆత్మకూరు: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీని రావణాసురుడిగా చిత్రీకరించి అవమానించిన బీజేపీ ప్రభుత్వం పట్ల యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకుడు చేవూరు శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో ఆత్మకూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతబట్టి ప్రధాని మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు, ఆత్మకూరు యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు గంగపట్ల రాంకీ, పి.మస్తానయ్య, సయ్యద్‌రసూల్, ఆలీంబాషా, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది బీ మురళి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. రైల్వే కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన మృతిపై రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ సంతాపం తెలిపారు.

ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్న చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల శ్రేయస్సును మరిచి ప్రజాధనాన్ని దోపిడీ చేయడమే కాకుండా తన ముఠా నాయకులకు ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచిపెట్టారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కావలిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవం అంటూ గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ముఖ్యమంత్రి హోదాను అడ్డం పెట్టుకొని నిధులు లూటీ చేసిన చంద్రబాబు, వ్యవస్థలను మేనేజ్ చేసుకొని కోర్టుల్లో కేసుల దర్యాప్తు జరగకుండా స్టేలు తెచ్చుకొనేవాడని పేర్కొన్నారు. స్కిల్ డెవలమెంట్‌మెంట్ కేసులో నిధులు దిగమింగేసినట్లుగా ఆధారాలతో సహా దొరికిపోయిన గజదొంగ చంద్రబాబు అని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడానికి అవకాశాలు లేకపోవడంతో చంద్రబాబును కోర్టు జైలుకు పంపిందని తెలిపారు. స్కిల్ స్కాం సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబేనని పేర్కొన్నారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే ఆయనకు అనుకూలంగా తీర్పు రావడం లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పక్కాగా అమలు చేస్తూ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల ఆదరణ పొందుతుండడంతో దుష్టచతుష్టయం ముఖ్యమంత్రిపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. జగనన్న చొరవతో రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే కావలి నియోజకవర్గం రూపురేఖలు, ప్రజల ఆర్థిక స్థితిగతులు అనూహ్యంగా మారిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు.

జగనన్న 175కు 175 సీట్లు గెలవాలని..

- ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రచారయాత్ర
- యాత్రికుడిని అభినందించిన కావలి ఎమ్మెల్యే



యాత్రికుడు కావూరి జయకుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో సుపరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల్లో 175కు 175 అసెంబ్లీ స్థానాలు గెలుపొందాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు ప్రచార రథయాత్ర చేస్తున్న కావూరి జయకుమార్‌ను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడు గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ సెప్టెంబర్ 12వ తేదీ ఇడుపులపాయలో ప్రచార రథయాత్రను ప్రారంభించారు. గురువారం కావలికి చేరుకున్నారు. శుక్రవారం కావలి పట్టణంలోని పలు కూడళ్లలో జయకుమార్ ప్రచారాన్ని కొనసాగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉంటేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంతోషంగా ఉంటారని ప్రజలకు వివరించారు. డిసెంబర్ 21వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజుకు 4,100 కిలోమీటర్ల యాత్ర పూర్తి చేసుకొని ఇచ్ఛాపురం చేరుకుంటారని, జయకుమార్ ఇంత కఠోరమైన శ్రమతో చేస్తున్న యాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.